# సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కె.మార్కాపురంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కె.మార్కాపురం గ్రామంలో సర్పంచ్ గణ మద్దిలేటి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బోయ శారద ముఖ్య అతిథులుగా హాజరై 112 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో రైతులు వ్యవసాయంలో ఇబ్బందులు పడకూడదనే ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టారన్నారు. ఆరోగ్యానికి భరోసాను ఇస్తూ ఆరోగ్య శ్రీ పథకం తీసుకువచ్చారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా రైతుల అభ్యున్నతి కోసం పగలే విద్యుత్‌ను అందిస్తూ, ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 25లక్షలకు పెంచారన్నారు.

**ప్రతి గడపకు లబ్ధి చేకూరింది**

ప్రజా సంకల్పపాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అన్నారు. అర్హతే ప్రమాణికంగా అర్హులైన వారందరికీ కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుండటంతో రాష్ట్రంలో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో 30లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు.

**112 మందికి ఇంటి పట్టాలు**

కె.మార్కాపురం గ్రామంలో 112 మందికి ఇంటి పట్టాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఇంటి స్థలాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనకు తేడాను గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణా రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎంపీటీసీలు మునిస్వామి, నాగేశ్వర రావు, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, దొరబాబు, శ్రీను, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారురాలికి ఇంటి పట్టాను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**చాలా సంతోషంగా ఉంది**



ఎన్నో సంత్సరాలుగా ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసి కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇంటి స్థలం మంజూరు కాలేదు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అధికారుల చుట్టూ తిరగకుండానే ఇళ్లు లేని మాలాంటి పేదలను గుర్తించి ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి స్థలం రావడంతో చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.
– బి.నాగమద్దమ్మ, కె.మార్కాపురం

**జగనన్నకు రుణపడి ఉంటాం**



మేము కొట్టంలో నివాసం ఉంటున్నాం. నేను, నా భర్త వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటాం. ఈ ప్రభుత్వంలో పేదలందరికీ మంచి జరుగుతుంది. మాకు అమ్మ ఒడి పథకం, రైతు భరోసా పథకాలు వస్తున్నాయి. పేదలకు ఇంత మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.
– కె.సావిత్రి, కె.మార్కాపురం.

## క్లుప్తంగా

### యువకుల బైక్ ర్యాలీ


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

గడివేముల: అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యువకుల ఆధ్వర్యంలో శోభాయాత్రలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రమైన గడివేములతో పాటు బూజునూరు, చిందుకూరు, గడిగరేవుల మీదుగా తిరుపాడు వరకు వందలాది బైకులతో జై శ్రీరామ్ అంటూ నినాదాలతో ర్యాలీ సాగింది.

### బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కొల్లంపల్లి తండా గ్రామ పరిసరా ప్రాంతాల్లో 1,800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 60 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఉలిందకొండ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ (ట్రైనింగ్ డీఎస్పీ) భావన, కర్నూలు రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉలిందకొండ, ఓర్వకల్లు ఎస్ఐలు నల్లప్ప, రాజారెడ్డి, పోలీసు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. అక్రమంగా నాటుసారా తయారు చేయడానికి ఏర్పాటు చేసుకున్న సారాబట్టీలను ధ్వంసం చేశారు.

### మాలలకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టికెట్లు కేటాయించి, రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేష్ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 36 లక్షల జనాభా ఉన్న మాలలకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించి సామాజిక న్యాయాన్ని పాటించాలన్నారు. గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లా లో దామోదరం సంజీవయ్య, సర్దార్ నాగప్ప, దామోదరం మునుస్వామి, ఎంకే లింగం వంటి ఎందరో ఉద్దండులు తమ ప్రతిభతో జిల్లా రాజకీయ చిత్రపటంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. రాజకీయంగా ఎంతో ఉన్నత పదవులను చేపట్టి, ఆ పదవులకే వన్నె తెచ్చిన మాలలకు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు నగేష్, రాజీవ్‌కుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీ గణతంత్ర వేడుకలకు పాణ్యం విద్యార్థినికి ఆహ్వానం

పాణ్యం: న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హాజరయ్యేందుకు గిరిజన విద్యార్థినికి ఆహ్వానం అందింది. పాణ్యం మండలం నెరవాడమెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆర్. రాధికాబాయి రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికై య్యారని ప్రిన్సిపాల్ మేరీ సలోమీ తెలిపారు. ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్ బెనిఫిషరిస్ ఫర్ విట్నిసింగ్ ద్వారా స్పెషల్ గెస్టుగా ట్రైబల్ వేల్ఫేర్ నుంచి ఈ విద్యార్థి ఎంపికయ్యారన్నారు. అనంతరం విద్యార్థినిని అభినందించారు.

### ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగుల శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ చేస్తారన్నారు. దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి ఫిజియోథెరపీ చేయించుకోవాలని ఎంఈఓ తెలిపారు.

### శ్రీరాముని అనుగ్రహం అందరూ పొందాలి


నరసింహారెడ్డినగర్‌లో కాషాయ జెండాలు, ప్రమిదలతో బీజేపీ నేతలు

కర్నూలు (న్యూటౌన్): శ్రీరాముని అనుగ్రహం అందరూ పొందాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. అయోధ్యలో శ్రీరామ భవ్య మందిరంలో కొలువు తీరనున్న రామ్‌లల్లా విగ్రహానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రాణ ప్రతిష్ఠ చేయడం అందరూ గర్వించదగ్గ విషయమన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్, సీతారాంనగర్‌లలో కాషాయ జెండా ఎగురవేద్దాం..దీపాలు వెలిగిద్దామంటూ ప్రమి దలు పట్టుకుని ఇంటింటికీ జెండాలను కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 22న దేశమంతా రామమయం కావాలని, శ్రీరాముడి చిత్రాలతో శోభాయాత్రలు చేయాలని, ప్రతి హిందువుని జైశ్రీరామ్ అని పలకరింపులు చేసుకోవాలని కోరారు. గుండా అమర్నాథ్, రాంబాబురెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు.

గూడూరు: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

## గణతంత్ర వేడుకల్లో మాజీ జవాన్లు పాల్గొనాలి

కర్నూలు(అర్బన్): సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సు మాజీ జవానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన సీ క్యాంప్‌లోని కార్యాలయంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో జిల్లాలోని మాజీ జవానులందరూ పాల్గొనాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగస్వామి, శేషిరెడ్డి కోరారు. జిల్లాలో ఉన్న సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్ దళాలకు చెందిన వారంతా హాజరు కావాలని కోరారు.

# ముమ్మరంగా కులగణన సర్వే

- ప్రజల నుంచి మంచి స్పందన
- రెండు రోజుల్లో 43 వేల 823 కుటుంబ సభ్యుల వివరాలు నమోదు
- 30.53 శాతం సర్వే పూర్తి చేశాం
- నగర పాలక అడిషనల్ కమిషనర్

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సామాజిక, ఆర్థిక కులగణనకు రెండు రోజుల క్రితం శ్రీకారం చుట్టింది. ఈ సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. కర్నూలు నగరంలో 133 సచివాలయాల పరిధిలో ప్రారంభించిన కులగణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. 10 రోజుల వ్యవధిలో సర్వే పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు 1100 మంది సచివాలయాల సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు, సహాయకులను అధికారులు నియమించారు. శనివారం ఉదయం నుంచి నగరంలో సర్వే ప్రారంభమైంది. నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డులను 2 వేల 180 క్లస్టర్లుగా కేటాయించారు. ఈ కస్టర్ల పరిధిలో మున్సిపల్ రికార్డుల ప్రకారం 1,43, 554 కుటుంబాలు ఉన్నాయి. ఈలెక్కన నగరంలోని కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ పరిధిలో మొత్తం 4,73, 876 మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరి పేర్లు, ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు, ఆధార్ కార్డు, ఇంటి నివాసం వివరాలు, ఆర్థిక స్థితి, కులం, ఉపకులం తదితర విషయాలను సచివాలయాల సిబ్బంది సేకరిస్తున్నారు. ప్రతి సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న సచివాలయాల సిబ్బంది ఆయా ఇళ్ల యజమానుల నుంచి బొటన వేలు ముద్ర వేయించుకుంటున్నారు. రెండో రోజు ఆదివారం రాత్రి వరకు సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 43,823 మంది నుంచి వివరాలు సేకరించారు. ఒకే సారి 133 సచివాలయాల పరిధిలో సర్వే ప్రారంభంకావడంతో కొన్నిసార్లు సర్వర్ బిజీ వస్తోంది. అయినా, సిబ్బంది సర్వేను వేగవంతంగా చేస్తున్నారు. ప్రజలు సైతం సర్వేకు సహకరిస్తూ అవసరమైన వివరాలు తెలియజేస్తున్నట్లు నగరపాలక అధికారులు వెల్లడించారు. కొన్ని ఏరియాల్లో స్థానికంగా ఉన్న కార్పొరేటర్లు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేస్తున్నారు.


గురురాఘవేంద్రనగర్‌లో కులగణన సర్వే వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది


97 వ సచివాలయం లక్ష్మీపురం పేటలో కుల గణన సర్వే చేస్తున్న సిబ్బంది

**30.53 శాతం సర్వే పూర్తి చేశాం**

జిల్లా కలెక్టర్, నగర పాలక కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని అన్ని వార్డుల్లో కులగణన సర్వే సాగుతోంది. రెండు రోజుల నుంచి సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 30.53 శాతం సర్వే పూర్తి చేశాం. సచివాలయాల సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ లోని వివరాలు సేకరణ చురుగ్గా జరుగుతుంది. ప్రతి క్లస్టర్ పరిధిలో జరుగుతున్న కులగణన సర్వేను తనిఖీలు చేస్తున్నాం.
– రామలింగేశ్వర్, అడిషనల్ కమిసనర్ , నగర పాలక సంస్థ కార్యాలయం

## శరవేగంగా కులగణన

గడివేముల: సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. బడుగు, బలహీన వర్గాల చిరకాల వాంఛను నెరవేరుస్తూ కులగణన చేపట్టింది. మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని కులగణను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రత్యేక యాప్ ద్వారా డేటా ఎంట్రీ చేస్తున్నారు. పనులు, ఉద్యోగ రీత్యా పగటిపూట అందుబాటులో లేనివారిని సాయంత్రం కలిసి ఈ కేవైసీ ద్వారా కులగణన కార్యక్రమాన్ని శరవేగంగా చేపడుతున్నారు.

**వేగంగా కులగణన సర్వే**

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వే మండలంలో వేగంగా సాగుతుంది. ఆదివారం సెలవు అయినప్పటికీ గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు సర్వేను కొనసాగించారు. ఇప్పటికే మండల అధికారులు గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా ప్రజల వివరాలను నమోదు చేయడంతో పాటు, కుటుంబ పెద్దతో ఈకేవైసీ చేయించాలని సిబ్బందికి సూచించారు.


గడిగరేవుల సచివాలయం పరిధిలో కులగణన సర్వే చేస్తున్న దృశ్యం


కోడుమూరులో కులగణన సర్వేను చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటరీలు

## లారీ అపహరణపై కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో ఈ నెల 9వ తేదీన లారీ అపహరణకు గురైనట్లు రంగయ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు.. బూజునూరు గ్రామానికి చెందిన లారీ ఓనర్ రంగయ్య ఈ నెల 8వ తేదీ రాత్రి లోడ్‌లేక పోవడంతో జిందాల్ ఫ్యాక్టరీ యార్డులో లారీ (ఏపీ21టీఏ 4891)ని ఉంచి ఇంటికి వెళ్లాడు. ఉదయాన్నే లోడ్ ఉండటంతో యార్డుకు వెళ్లగా లారీ కనిపించలేదు. అప్పటి నుంచి చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

# దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కర్నూలు (టౌన్) : నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక హంద్రీ నది, కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం లేక నిలిచిన నీటిలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నగరపాలక మలేరియా విభాగం ఆధ్వర్యంలో పిచికారీ చేశారు. కెనాల్‌లో పూడిక తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్ ప్రాంతంలో దోమల లార్వాల నివారణ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరు కూడా వ్యర్థాలను కెనాల్ వేయకూడదని చెప్పారు. మురికివాడల్లో ప్రతిరోజు ఫాగింగ్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కేసీ కెనాల్‌లో దోమల నివారణకు పిచికారీ చేస్తున్న మలేరియా సిబ్బంది

# పండిత గానాల స్ఫూర్తితో ముందుకు వెళ్దాం


గానాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): సమాజంలో విశ్వ బ్రాహ్మణులకు సముచిత కల్పించేందుకు విశేష కృషి చేసిన ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యులు, బ్రహ్మశ్రీ రావు సాహెబ్ గానాల పండిత గానాల రామ్మూర్తి స్ఫూర్తితో ముందుకు వెళ్దామని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి పేర్కొన్నారు. ఆదివారం గానాల రామ్మూర్తి 132వ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లోని గానాల విగ్రహానికి విశ్వ బ్రాహ్మణ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు కమ్మరి పార్వతమ్మ, బ్రహ్మయ్య ఆచారి, వడ్ల శ్రీనివాసులు ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఓసీలుగా ఉన్న విశ్వ బ్రాహ్మణులను బీసీలుగా చేర్చి ఎంతో మేలు చేశారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు కల్పించి చట్టసభల్లో అడుగు పెట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్ల సుమంత్ ఆచారి, రఘువాచారి, రజక రాంబాబు, క్రిష్ణవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ పునరుద్ధరణ ధ్యేయంగా ఉద్యమాలు

కర్నూలు(అర్బన్): వాల్మీకులకు ఎస్టీ పునరుద్ధరణ సాధించే వరకు ఐక్యంగా ఉద్యమాలను చేపట్టనున్నట్లు హైకోర్టు న్యాయవాది బి. సూర్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఓ హోటల్ సమావేశ భవనంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంలో చిత్తశుద్ధి కనబరచడం లేదన్నారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు భవిష్యత్తులో అన్ని వాల్మీకి సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేపడతామన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో పర్యటించి వాల్మీకులకు జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తామన్నారు. ఈ నేపథ్యంలోనే 24 మందితో రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీకి రాష్ట్ర కన్వీనర్‌గా సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు బాల వెంకటేశ్వర్లు, టి. మద్దులేటి, వలసల రామక్రిష్ణ, న్యాయవాదులు మురళీ, శ్రీనివాసులు, మహిళా నాయకురాలు ఇంద్రాణి, సుకుమార్, వెంకటరమణ, ప్రొఫెసర్ టి. ముక్కరన్న, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం వ్యక్తం చేస్తున్న వాల్మీకి నేతలు

## కేసీకి 159 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.531 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## పేదల ఆరోగ్యానికి భరోసా

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.19,20,000 చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రమైన గడివేములకు చెందిన దేశం జయమ్మ మోకాళ్ల నొప్పులతో బాధపడుతుండేది. దీంతో గతనెలలో మోకాళ్ల ఆపరేషన్ చేయించుకుంది. ఈ మేరకు ఆమె సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, రూ.60వేలు మంజూరు కాగా ఆదివారం ఆమె కుమారుడు మహేశ్వర్‌రెడ్డికి చెక్కును ఎమ్మెల్యే కాటసాని అందజేశారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

## క్రీడాపోటీలను విజయవంతం చేయండి

కర్నూలు (టౌన్): 75వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జి.జె.ఎస్. యూత్, సాయిక్రిష్ణ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జె.సుకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని సంస్కృతి పార్కులో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 26 వ తేది మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ముగ్గుల పోటీలు, త్రోబాల్, రన్నింగ్, లెమన్, స్పూన్, మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్ వంటి క్రీడాంశంలో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు ఉంటాయని, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు.


బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జె.సుకుమార్

# బీమాతో ధీమా

- తపాలాశాఖ ఆధ్వర్యంలో బీమా పథకాలు
- రూ.399లకే గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ
- రూ.10లక్షల బీమా ప్రయోజనం
- 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులు



హెడ్ పోస్టాఫీస్, కర్నూలు డివిజన్ కార్యాలయం

కర్నూలు (న్యూటౌన్): బీమా గురించి తెలియకపోవడం వల్ల పేద కుటుంబాలు ఇంటి పెద్దను కోల్పోయి రోడ్డున పడుతున్నాయి. కూలీ పని చేసుకునే వారితో పాటు పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగకరంగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ ప్రీమియంతో, ఎక్కువ బీమాను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే తపాలాశాఖ ఆధ్వర్యంలోని గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కర్నూలు డివిజన్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ జి.కిరణ్ సూచిస్తున్నారు.

**ఏడాదిపాటు కవరేజి**

తపాలాశాఖ టాటా ఏఐజీ, బజాజ్ అలయాన్జ్ ఇన్సూరెన్స్ సంస్థల సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కేవలం రూ.399కే అందుబాటులోకి తెచ్చింది. ఈ పాలసీ ద్వారా ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు రూ.10లక్షల బీమా కవరేజీ వర్తిస్తుంది. యాక్సిడెంటల్ బీమా పాలసీ 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయసుగల వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ పాలసీని గతేడాది ఏప్రిల్ నెలలో తపాలాశాఖ ప్రవేశపెట్టింది. ఇప్పటికే కర్నూలు డివిజన్‌లో 8,504, నంద్యాల డివిజన్‌లో 3,431 మంది పాలసీ తీసుకున్నారని అధికారులు తెలిపారు.


జి కిరణ్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్

**బీమా పాలసీ పొందాలంటే..**

ఈ పాలసీ పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. లేని వారు రూ.200తో నూతనంగా ఖాతాను తెరవాలి. రూ.399 నగదు చెల్లించి బీమా పాలసీ పొందవచ్చు. ప్రమాదం సంభవిస్తే మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్న వారికి ఈ బీమా వర్తించదు. బీమా చేసుకున్న తరువాత ప్రమాదం సంభవించినా, పక్షవాతం వంటివి వచ్చినట్లయితే ఈ బీమా వర్తిస్తుంది. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు నుంచి బీమా రక్షణ లభిస్తుందని తపాలాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ బీమా పొందేలా ఈ పాలసీని రూపొందించారు. మరిన్ని వివరాల కోసం తపాలాశాఖ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. క్లెయిమ్ కోసం 18002667780, 1800229966 నంబర్లలో సంప్రదించాలని, సీనియర్ సిటిజన్ పాలసీదారులకు మాత్రమే ఈ నంబర్లను కేటాయించడం జరిగిందని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ తెలిపారు.

**పాలసీ ప్రయోజనాలు..**

- యాక్సిడెంటల్ డెత్ (ప్రమాదవశాత్తు మృతి చెందినట్లయితే) రూ.10లక్షలు వర్తిస్తుంది.
- శాశ్వత వైకల్యం సంభవిస్తే వారికి రూ.10లక్షలు.
- ప్రమాదవశాత్తు అంగచ్ఛేదం రూ.10లక్షలు
- పక్షవాతం సంభవిస్తే రూ.10లక్షలు
- వైద్య ఖర్చులకు (ఐపీడీ) రూ.60వేల వరకు లేదా వాస్తవ క్లెయిమ్ ఏది తక్కువైతే అది నిర్ణయిస్తారు.
- విద్య ప్రయోజనం (గరిష్ఠంగా అర్హత ఉన్న ఇద్దరు పిల్లలకు) 10 శాతం, రూ.లక్ష, అసలు ఖర్చులు ఏది తక్కువ ఉంటే అది వర్తిస్తుంది.
- అస్పత్రిలో ఉంటే 10 రోజుల వరకు రోజు రూ.1000 అందుతుంది. (ఒక రోజు మినహాయించబడుతుంది).
- కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.25వేలు, అసలు ఏది తక్కువైతే అది. అంత్యక్రియల ప్రయోజనం రూ.5వేలు.